క్లుప్తంగా

సంపద కేంద్రాల సందర్శన



దేవరపల్లిలో సంపద కేంద్రం వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ, సర్పంచ్, అధికారులు

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో గల సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్ రెడ్డి సందర్శించారు. సంపద కేంద్రంలో వర్మీకం పోస్టు తయారవుతున్న తీరును పరిశీలించారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి ఎస్. రవికిషోర్ వివరించారు. సంపద కేంద్రం వద్ద 20 రకాల మొక్కలను ఎంపీపీ, సర్పంచ్, ఎంపీడీఓ నాటారు. గ్రామ సచివాలయ కార్యదర్శి ఎస్‌కే సమీనా బేగం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతర ప్రారంభం

నిడదవోలు రూరల్: మునిపల్లి గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈనెల 9న సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపు, 10న రాత్రి బలిచేట, 11న అమ్మవారికి నైవేద్యాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. పోలేరమ్మ జాతరతో గ్రామమంతా బంధువులతో కళకళలాడుతోంది. గ్రామ పుర వీధుల్లువిద్యుద్దీపాలతో ఆకర్షిస్తున్నాయి.

మహాలక్ష్మి అమ్మవారి సంబరాలు

చాగల్లు: స్థానిక శ్రీమహాలక్ష్మి అమ్మవారి వార్షిక సంబరాలు గురువారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవాలకు, పంచాహ్నిక దీక్ష పూజా కార్యక్రమాలు కొఠారు వెంకటరమేష్, దేవి ప్రసన్న దంపతులు కలశ స్థాపన పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు భజనలు చేశారు. ఈ ఉత్సవాలు 12వ తేదీ వరకూ జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు విశేష పూజలు జరుగుతాయని కమిటీ తెలిపింది.

కనుల పండువగా గోపాలస్వామి కల్యాణం

నిడదవోలు : పట్టణంలో ఉన్న మదన గోపాల స్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణం కనుల పండువగా సాగింది. పట్టణ నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి కల్యాణాన్ని కనులారా తిలకించారు.

వాహనాల తనిఖీ

ఉండ్రాజవరం: వాహనచోదకులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వెంట ఉంచుకోవాలని ఎస్సై జి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పాలంగి వద్ద సిబ్బందితో కలిసి ఆయన వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహన దారులకు వాటిపై అవగాహన కల్పించారు. బైక్‌పై ముగ్గురు వ్యక్తులు ప్రయాణం చేయకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. ఇస్తే వచ్చే నష్టాలు, తల్లిదండ్రులకు శిక్షలను వివరించారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

దేవరపల్లి: స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి దేవరపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 10 నుంచి 26వ తేదీ వరకూ నిర్వహిస్తున్నారు. నిట్టా మోహిత్ నాగ్ ఆర్థిక సహకారంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరుగుతోందని నిర్వాహకులు అఖిల్, ముని, సతీష్ గురువారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన జట్టు ఈ నెల 10వ తేదీ లోగా ఎంట్రీ ఫీజు రూ.2 వేలు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లోని గ్రామ పంచాయతీల నుంచి జట్లు పాల్గొనవచ్చునని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.55,555, ద్వితీయ బహుమతి రూ.33,333, తృతీయ బహుమతి క్రికెట్ బ్యాట్, బాల్స్ కిట్ అందజేస్తామని వివరించారు. ఉత్తమ బ్యాట్స్‌మన్, బౌలర్లకు చెరో రూ.2,999 అందజేస్తామని రవికిషోర్ తెలిపారు. టీము సభ్యులు 15 మంది ఉండాలన్నారు. తొమ్మిది మంది ఆటగాళ్లు ఒకే పంచాయతీ వారై ఉండాలని, ఇద్దరు ఔటర్లకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఆటగాళ్లు, డ్రస్ కోడ్ పాటించాలన్నారు. ఆటగాళ్లు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మ్యాచ్‌లో అంపైర్‌దే తుది నిర్ణయమని, నాకౌట్ పద్ధతిలో టోర్నమెంట్ జరుగుతుందని పేర్కొన్నారు. ఒక జట్టులో ఆటగాళ్లు వేరొక జట్టులో ఆడరాదని స్పష్టం చేశారు. వివరాలకు 95023 25464, 81217 15391, 86889 23429 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు

తాళ్లపూడి: మండలంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త రేషన్ కార్డుల కోసం అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తాళ్లపూడి మండల ఇన్‌చార్జి సివిల్ సప్లయ్ డీటీ దివాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామ సచివలయాల వద్ద దరఖాస్తులు అందించవచ్చని తెలిపారు. కొత్త కార్డు దరఖాస్తులతో పాటు కార్డులో కొత్తవారిని కలపడం లేదా తీసివేయడం, అడ్రస్ మార్పు, కార్డు సరెండర్ చేయడం, ఆధార్ సీడింగ్ కరెక్షన్, ప్రభుత్వం పేర్కొన్న నిబంధనలు పాటిస్తూ, దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మనోధైర్యం కల్పించడానికే మాక్ డ్రిల్

- యుద్ధ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై దేవరపల్లిలో అవగాహన
- తహసీల్దార్ అచ్యుతకుమారి



దేవరపల్లి బస్టాండ్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

దేవరపల్లి: యుద్ధ సమయంలో ప్రజల్లో మనోధైర్యం కల్పించడానికి గ్రామ స్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని, ప్రతి వ్యక్తి దేశభక్తిని పెంపొందించుకుని ఉగ్రవాదుల ప్రతీకార దాడులను ధైర్యంగా ఎదుర్కొనాలని స్థానిక ఎస్సై వి.సుబ్రహమణ్యం, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాల మేరకు గురువారం దేవరపల్లి బస్టాండ్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు యుద్ధ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, అప్రమత్తతపై అవగాహన కల్పించారు. సిందూర్ ఆపరేషన్‌లో భారత్ సైనికులు ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి నేలమట్టం చేయడంతో పాటు దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చినందున భారత్‌పై ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్టాండ్లు, హోటల్స్, ప్రధాన ఆలయాల వద్ద దాడులకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. యుద్ధ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెద్ద సైరన్ మోగుతుందని ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారన్నారు. ఆ సమయంలో జనరేటర్లు, ఇన్వర్టర్లు వినియోగించరాదన్నారు. రోడ్లపై పరుగులు తీయరాదని, నేలపై పాకుతూ సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. రెండు, మూడు అంతస్తుల భవనాల్లో ఉండే ప్రజలు గ్రౌండ్ ఫ్లోర్‌కు చేరుకోవాలన్నారు. దాడుల్లో భవనాల శిథిలాల కింద ఉన్న క్షతగాత్రులను గుర్తించి వెంటనే ఆసుపత్రికి లేదా దగ్గరలో ఉన్న ఆర్‌ఎంపీల వద్దకు తీసుకువెళ్లి వైద్యం చేయించాలన్నారు. ప్రమాదకర సంఘటనలు జరిగినా, అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరించినా పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ అధికారి కార్యాలయంలో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ సమయంలో ప్రాణాలను ఏవిధంగా కాపాడుకోవాలి, క్షతగాత్రులను ఏవిధంగా ఆసుపత్రికి తరలించాలనే దానిపై డెమో నిర్వహించారు. గ్రామ స్థాయిలో మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు వీఆర్వోలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెరవలి: పెరవలిలో తహసీల్దార్ డి అచ్యుత కుమారి ఆధ్వర్యంలో మండల అధికారులు ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ, అధికారులు పాల్గొన్నారు.

చాగల్లు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. తహసీల్దారు ఎం.మెరికమ్మ మాట్లాడుతూ అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగిన, బాంబులు పేలిన, అగ్ని ప్రమాదల సంభవించిన ప్రజలందరూ అప్రమత్తం ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: దేశంలో నెలకొన్న పరిస్థితులు దృష్ట్యా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ వద్ద గురువారం పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారుల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై రామకృష్ణ, తహసీల్దార్ పి.మోహనభారతి మాట్లాడుతూ అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీబీ వెంకట రమణ, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీవో రమాదేవి, వీఆర్వోలు ప్రకాష్, నాగేశ్వరరావు, సంజీవరావు, సంతోష్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గోపాలపురం: పాకిస్తాన్‌పై భారత్ ఉపయోగించిన ఆపరేషన్ సిందూర్‌పై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ కె.అజయ్‌బాబు మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి యుద్ధంలో పాల్గొన్న భారత్ సైనికులకు మద్దతు తెలియజేయాలని ఎప్పుడు యుద్ధం వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నదే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమన్నారు. ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు, చక్రవర్తి, అధికారులు పాల్గొన్నారు.

నల్లజర్ల: భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో యుద్ధసన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పిస్తూ గురువారం నల్లజర్లలో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు మాట్లాడుతూ ఏ క్షణమైన దాడులు జరగొచ్చని, అందరూ అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఎంపీడీఓ సింహాద్రి, ఎస్‌ఐ సత్యనారాయణ, డాక్టర్ సిరాజుద్దీన్, విద్యుత్ ఏఈ బాపిరాజు, ఎంఈఓ భగవతి, వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెరవలిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న తహసీల్దార్ అచ్యుతకుమారి



తాళ్లపూడిలో మాక్ డ్రిల్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై, తహసీల్దార్, ఎంపీడీవో

ప్రమాదాలు ఎదుర్కొనేలా అవగాహన



కొవ్వూరులో మాక్ డ్రిల్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీసుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): యుద్ధ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తత తో ఉండాలని, స్వీయ రక్షణ చర్యలు తీసుకోవడం ముఖ్యమని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం పోలీస్, రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు ఆపరేషన్ సింధూర మాక్ డ్రిల్ నిర్వహణపై ప్రజలకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాణీ సుస్మిత మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో యుద్ధ హెచ్చరికల మేరకు ఎటువంటి ప్రమాదాలనైనా ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్ ద్వారా పెద్దల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.కొవ్వూరు డివిజన్‌లో ప్రజలకు ప్రమాదాలు జరిగినప్పుడు వైద్య సేవలు అందించేందుకు 26 హాస్పిటల్స్, 48 వైద్యాధికారులు, 150 మంది నర్సులు, 10 అంబులెన్సులు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. ఏదైనా ప్రమాదం అన్న సమయంలో సైరన్ మోగుతుందని, అప్పుడు అందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండడం, ప్రజలు వారిని వారు రక్షించుకోవడం, ఇతరులను రక్షించడంలో భాగస్వామ్యం కావాలని ఆర్డీవో పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ , డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సంధ్య, టౌన్ సీఐ పి.విశ్వం, తహసీల్దార్ దుర్గా ప్రసాద్, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల నియామకం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



పెద్దేవం సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు

తాళ్లపూడి: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి గ్రామ కమిటీలను నియమించినట్టు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. పెద్దేవంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీని ఎన్నుకోవడానికి నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కొర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొని నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ నియోజక వర్గంలోని మూడు మండలాల్లో కూడా గ్రామ కమిటీలను త్వరితగతిన పూర్తి చేసినట్టు తెలిపారు. గ్రామ స్థాయిలో నాయకులు కలికట్టుగా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల కన్వినర్‌కొలిశెట్టి నాగేశ్వరరావు, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ జిల్లా యాక్టివ్ కార్యదర్శి వంబోలు పోశిబాబు, నాయకులు తోట రామకృష్ణ, కోడి గంగారావు, బట్టు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తానేటి వనితకే సంపూర్ణ మద్దతు

- వైఎస్సార్ సీపీ మండల సమావేశం తీర్మానం
- తప్పుడు కథనంపై నేతల ఆగ్రహం



పల్లంట్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు, వేదికపై పార్టీ నేతలు

దేవరపల్లి: మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వకర్త తానేటి వనితకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పార్టీ నేతలు తీర్మానం చేశారు. మండలంలోని పల్లంట్లలో పార్టీ మండల కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం పార్టీ మండల ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఎన్టీవీలో తానేటి వనితపై వచ్చిన తప్పుడు కథనాన్ని నేతలు ముక్తకంఠంతో ఖండించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆమె విస్తృతంగా పర్యటిస్తూ, కార్యకర్తలకు అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. వాస్తవాలను ప్రచురిస్తే ప్రజలు సంతోషపడతారని హితవు పలికారు. ఎన్టీవీ కథనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో వనిత గ్రూపులను ప్రోత్సహిస్తున్నట్టు ఎన్టీవీలో వెలువడడం దురదృష్టకరమన్నారు. తానేటి వనిత సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉన్న కుటుంబం నుంచి వచ్చారని, ఆమె తండ్రి రెండు సార్లు ఎమ్మెల్యేగా పని చేసి నియోజవర్గ ప్రజలకు సేవలందించారన్నారు. ఆధారాలు లేకుండా చానల్ రేటింగ్‌ను పెంచుకోవడానికి తప్పుడు కథనాలను ప్రచురిస్తే న్యాయ పోరాటం చేసి, పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీపై బురద జల్లే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు తానేటి వనితకు బేషరతుగా మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, తానేటి వనిత నాయకత్వంలో తామంతా పనిచేస్తున్నట్టు వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు సత్తి జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ, సమస్యల పరిష్కార దిశగా తానేటి వనిత ముందడుగు వేస్తున్నారని, ఆమె నాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. పార్టీ విజయం కోసం వనిత నాయకత్వంలో అంతా కలసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ మాట్లాడుతూ, వనిత కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ, నిరంతరం నియోజకవర్గంలో పర్యటిస్తూ, పార్టీ శ్రేణులకు మనోధైర్యం కల్పిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. వనితపై వచ్చిన తప్పుడు కథనాన్ని పార్టీ మండల కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, ఏఎంసీ మాజీ చైర్మన్లు గన్నమని జనార్దనరావు, నరహరిశెట్టి రాజేంద్రబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి కుసులూరి వెంకటసతీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు రాయుడు వెంకట్రావు, పార్టీ నాయకులు గడా రాంబాబు, పచ్చా రాంగోపాల్, దుగ్గిన గంగాధర్, సుంకర గంగరాజు, సత్తి సాయి ఈశ్వరరెడ్డి, బొంతా భరత్‌బాబు, దుగ్గిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గడా జగదీష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు వేర్వేరు ప్రకటనల్లో ఎన్టీవీ కథనాన్ని తీవ్రంగా ఖండించారు.

కమనీయం.. వెంకన్న కల్యాణం



అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామికి కల్యాణం

- గోవింద నామస్మరణతో మార్మోగిన అన్నవరప్పాడు గ్రామం
- ఎదుర్కోలు ఉత్సవంలో పాల్గొన్న వేలాది భక్తులు



అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఎదుర్కోలు ఉత్సవంలో ఊరేగింపుగా వస్తున్న వేంకటేశ్వరస్వామి

పెరవలి: వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా జరిగింది. తెల్లవారు జాము నాలుగు గంటలకు స్వామివారి సుప్రభాతసేవ, అనంతరం సర్వదర్శనం చేశారు. శ్రీరామ పట్టాభిషేక వేదికలో అఖండ శ్రీరామనామ సంకీర్తన కార్యక్రమం ప్రారంభించారు. మధ్యాహ్నం స్వామివారికి ఎదుర్కోలు ఉత్సవం చేశారు. కల్యాణంలో పంతం ఆదినారాయణ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, పాప్పొప్పు నాగే శ్వరరావు దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి వేద పండితులు కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా శ్రీ భక్తాంజనేయ కోలాట భజన బృందంచే ఆలయ ప్రాంగణంలో కోలాటం నిర్వహించారు.

వైభవంగా శ్రీవారి డోలోత్సవం

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి డోలోత్సవం (ఊంజల్ సేవ) వైభవంగా నిర్వహించారు. శ్రీవారి బ్రహోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీచక్రస్నానం, మహాపూర్ణాహుతి, కుంభకళాన్యాసం, వేదాశీర్వచనం, సాయంత్రం విష్వక్సేనారాధన, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, ఏకాంత సేవ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వలి కుటుంబానికి ఆర్థిక సాయం



వలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రంగా వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు

నిడదవోలు : పట్టణానికి చెందిన వంట మాస్టర్ వలిబాషా హత్యకు గురై మృతి చెందడంతో పట్టణ బీజేపీ నాయకులు గురువారం వలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పేద కుటుంబానికి చెందిన వలి ఇద్దరు కుమార్తెల చదువు నిమిత్తం నాయకులు రంగా వెంకటేశ్వరరావు రూ.20 వేలను అందజేశారు. ప్రభుత్వం తరపున వలి కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి తీసుకువెళతామని రంగా వెంకటేశ్వర్లు బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ మైనార్టీ కార్యదర్శి షేక్ కొమరుద్దీన్, మోర్త ప్రమోద్ కుమార్, బండి సత్యనారాయణ, నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి వెండి హస్తాల సమర్పణ



దేవరపల్లిలోని శ్రీవారి ఆలయానికి వెండి హస్తాలు సమర్పిస్తున్న దాతలు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి గ్రామానికి చెందిన దాతలు సుతాపల్లి సత్యశ్రీనివాస్(బాబి), సీతారత్నం దంపతులు, కుటుంబ సభ్యులు గురువారం వెండి హస్తాలు సమర్పించారు. హస్తాలను ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్, సభ్యులు తీగెల బలరామయ్య, ఆలయ అర్చకులకు అందజేశారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలి



చాగల్లు రైతు సేవా కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చాగల్లు: రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద కొద్దిసేపు నిరసన తెలిపి టార్గెట్ లేదనే నెపంతో గత 15 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతికూల వాతావరణం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు సంఘం నాయకులు జీవీ సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, కొఠారు నాగేశ్వరరావు, ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

బాలికల భవితకు బాటలు

- కిశోర వికాసంతో అవగాహన
- గ్రామాల్లో సదస్సులు
- గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 8,029 మంది బాలికలు



అనంతపల్లిలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నల్లజర్ల: కౌమార దశలో బాలికల అనారోగ్య సమస్యలు, ఇతర ఒడిదొడుకులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కిశోర వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవులలో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. బాలికలలో ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యంగా ఇతర శాఖల సమన్వయంతో సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. మే 2వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 10వ తేదీ వరకూ కొనసాగుతుంది.

గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో..

గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లోని 57 గ్రామాలలో 534 గ్రూపులుగా 8,027 మంది కిశోర బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఆర్వో, ఎంపీహెచ్‌ఓలతో కూడిన బృందాలు గ్రామాలలో ప్రతి మంగళ, శుక్రవారాలలో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఆహారం, పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మరక్షణ, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామస్థాయిలో కమిటీ

కిశోర వికాసం కోసం గ్రామస్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా ఐదుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. దీనిలో అంగన్‌వాడీ కార్యకర్త, ఎంపీహెచ్ ఓ, సచివాలయ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లు ముఖ్యపాత్ర పోషిస్తారు. ఈ కమిటీ కౌమార బాలికల వివరాలను సేకరించి వారిని బృందాలుగా ఏర్పాటు చేసి వారితో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఈ ఏర్పాట్లలో మహిళా సంరక్షణ కార్యదర్శి కీలకంగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన నలుగురు సభ్యులు కార్యక్రమానికి సహకరిస్తారు.

గ్రూపులుగా విభజన

14 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసున్న వారిని ఓ గ్రూపు, 11 ఏళ్ల నుంచి 14 ఏళ్ల లోపు బడి మానేసిన పిల్లలను గుర్తించి మరో గ్రూపుగా విభజిస్తారు. వారికి ఎంపిక చేసిన అంశాలపై అనువైన సమయంలో గంటసేపు శిక్షణ ఇస్తారు. ఇటీవల బాలికలే లక్ష్యంగా మోసాలు పెరిగాయి. ప్రధానంగా ప్రేమ పేరుతో కొందరు వంచనకు గురి చేస్తున్నారు. మరికొందరు రాజీ పేరుతో బాల్యవివాహాలను ప్రోత్సహిస్తున్నారు. బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించి, ఆయా అంశాలపై సమర్థవంతంగా ఉండేలా శిశు సంక్షేమ శాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

కమిటీల ఏర్పాటు



కిశోర వికాసం ద్వారా బాలికలలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించి, ప్రాజెక్టు పరిధిలోని 54 గ్రామాలలో కమిటీలను పూర్తి చేశాం. వేసవిలో కిశోర బాలికలకు ఉపయోగపడేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సామాజిక అంశాలపై చైతన్యవంతులను చేస్తున్నాం. తద్వారా సమాజంలో మార్పునకు శ్రీకారం చుడుతున్నాం.

– యూవీ పద్మావతి, ఏసీడీపీఓ, గోపాలపురం ప్రాజెక్టు

పూర్తిస్థాయిలో అవగాహన



బాలికలకు ఎదురయ్యే సమస్యలపై కిశోర వికాసం ద్వారా పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం సమాజంలో బాలికలే లక్ష్యంగా మోసాలు పెరిగిపోయాయి. వాటిపై వారిపై వారికి అవగాహన కలిగించి, సమర్థంగా ఎదుర్కొనేలా కృషి చేస్తున్నాం.

– కనకదుర్గ, మహిళా సంరక్షణ కార్యదర్శి, అనంతపల్లి